

# ఫలించిన ప్రయాస

రచన: ఇచ్ఛాపురపు రామచంద్రం బి. ఏ.

రైలు దిగి ప్లాటుఫారంవేపు నడుస్తున్నాను.

ఎదురుగ అందమైన కిల్లీషాపు. ఆషాపును చూడగానే ఆ షాపువద్ద కలిగిన అనుభవం గుర్తుకొచ్చింది.

సరిగా రెండు సంవత్సరాలక్రితం! ఆరోజున ఆ వూర్లో జరిగే ఇంటర్వ్యూకి హాజర్ అపటానికి దిగేను రైలు. ఆ ఆఫీసర్‌వద్ద మామయ్యకి ఎంతో పలుకుబడి వుందని, ప్రయత్నిస్తే ఉద్యోగం రావచ్చునని బయలుదేరేను. కాని మనసులోమాత్రం జంకుగానే వుంది. తనకంటే క్వాలిఫికేషన్సూ రికమెండేషన్సూ ఉన్నవాళ్లింకా ఎందరున్నారో ఆ ఒక్క కాళీ కోసం! అయినా ప్రథమ ప్రయత్నం కనుక తప్పినా ఫరవాలేదు అని మనసుని ధైర్యం చేసుకున్నాను.

నేను రైలు దిగుతూండగానే ఎవరో అమ్మాయి ఎడ్యుకేటెడ్‌లా వుంది. మంచి మేకప్‌లో ఆకర్షణీయంగా కిల్లీషాప్‌వద్ద నిలుచుని నావేపే చూస్తుంది. అసలే అందంగా ఉన్న ఆమెకళ్లకు సన్నని కాటుకరేఖలు మరింత అందంచేకూర్చేయ్, ఆమె నావైపు అదోలా చూచి చిరునవ్వు నవ్వింది. ఆమె ఒక్క చిరునవ్వూ నా హృదయంలో వేల పువ్వుల్ని రువ్వింది. శరీరం మనసూ ఒక దానికంటే మరొకటి వశం తప్పాయి.

ఆమె నాకేసి చూస్తూనే నన్ను రమ్మన్నట్టు సైగచూపుచూసి స్టేషన్ దాటుతూంది. నా మనసులోంచి 'ఇంటర్వ్యూ టైమవుతూంది. ఏంపనిమీద వచ్చేవ్? ఏం చేస్తున్నావ్?' ఏ మూలనుంచో హెచ్చరిక! నిజంగా అలాటి మధురక్షణాలు మళ్లీతటస్థిస్తాయా జీవితంలో. ఏవిధంగానూ ఆశించలేని ఆ యింటర్వ్యూకంటే మరులుగొలిపే మగువమీద ఆశపెట్టుకోవటం నయమేకదూ! తనకు సెలక్షన్ వస్తుందన్న నమ్మకంలేని ఆ యింటర్వ్యూకంటే ఈ అందాలభరిణమీద నమ్మకంపెట్టుకోవటం మంచిదనిపించింది. ఇంటర్వ్యూకి తిలాంజలులు విడిచేను ప్రయత్నపూర్వకంగా!



నన్నెందుకామె అలా కవ్వించాలి? ప్రథమ వీక్షణంలోనే మగువలని ముగ్ధలు గావించే రూపం నాలో లేదే? ఏదో సామాన్యుణ్ణి! మరి! అయినా ఏమో! నాలో ఏ ఆకర్షణ చూడగలిగిందో ఆమె? ఏమీ లేకపోతే నన్నెందుకు తన వెంట రమ్మంది?

స్టేషన్ ఆవరణ దాటగానే ఆమె స్వయంగా టాక్సీ మాట్లాడి నా కోసం తలుపు తెరచి వుంచింది. ఏమిటో నాకే ఊహాతీతమైన ఆహ్వానం. ఎందుకామె అలా ప్రవర్తిస్తుంది? బుఱ్ఱపనిచేయటం మానివేసింది. ఆసౌందర్య రాశిని చూస్తూ వణకుతూన్న శరీరాన్ని అదుపులోకి తీసుకురాలేక చిరుచెమటలతో ఆమె ప్రక్క కూలబడ్డాను. ఆమెముఖంలో ఏదో ఆనందం అవధులు దాటుతూంది. నన్ను చూసేనా?

టాక్సీ చాల వేగంగా పరుగెడ్తోంది. ఎక్కడికో? ఆమెకే తెలుసు. వాచీ చూసుకొన్నాను. సరిగా తను యింటర్వ్యూకి ఎటెండ్ అయితే ఆఫీసర్ గడ్డుప్రశ్నలకి సమాధానంకోసం బుఱ్ఱబద్దలుగొట్టుకోవలసివుండేది. కాని అంతకంటే చిత్రంగా ఉందీమె ప్రవర్తన. తన నెక్కడికి తీసుకువెడుతుందో? ఆమె మౌనాని కర్థం యేమిటి? జారవిడుచుకున్న ఉద్యోగావకాశం ఏమాత్రం బాధపెట్టలేదు.

నిశ్శబ్దం భరించలేక 'ఎక్కడికి వెతుతున్నామండి?' అడిగేనూ?

ఆమె మెత్తగా తీయగా నవ్వి 'ఆ దూరాన బంగళాలో ప్రశాంత వాతావరణంలో కళాజీవుల సాధనలు దర్శించి హృదయం విశాలం చేసుకుందుకు ?

ఆమెమాటలు నా కర్థంకాలేదు. కొంచం సేపయాక టాక్సీ ఆగింది. బంగళాలోకి నడిచేం యిద్దరమూ. ఎక్కడచూసినా శిల్పాలే. పూలమొక్కలమధ్య అందమైన పురాతన శిల్పాలు. ఆమెచేయి నా చేతిలో పరవశం ప్రవహింపజేస్తుంది. ప్రతిశిల్పానికీ ఆమె ఏవేవో చరిత్రలు చెపుతూంది. ఆమెకన్న అందంగా లేవేమో ఆ శిల్పాలు! నా మనసు వేరొకచోట ఆలోచిస్తుందని ఆమెకేం తెలుసు.

అలా మైకంలోనే ఎదురుగ చూసేను. పూపొదలమరుగులో పైనుంచి తడుపుతూన్న నీటితుంపర్ల చల్లదనానికి విరుగుడుగా స్త్రీ పురుషులు నగ్నంగా బిగికౌగిలిలో ముద్దుపెట్టుకుంటూన్నట్లు చెక్కబడిన శిల్పం! అత్యంత దర్శనీయంగా ఉందా శిల్పం! మనసూ తనువూ విజృంభించేయ్. నాచేతివేళ్లమధ్య ఆమె ఆరచేయి అలాగే వుంది. ఏదో తెగింపు అవహించింది నాలో. మరుక్షణంలో ఆమే నేనూ ఎదురుగ శిల్పానికి ప్రత్యాకృతిగ నిలిచేం. వణకుతూన్న మాపెదవులు ఏకమయ్యేలోగానే ఎవరిదో అలికిడి మమ్మల్ని విడదీసింది. బాధగా ఆమె ముఖంలోకి చూసేయ్ కళ్ళు. ఆమెచేయివదలించుకొని నడిచింది. ఎందుకో ఆ శిల్పం నన్నాకర్షించింది. అలాగే చూస్తున్నాను. కొద్దిసేపయాక ఆమెకోసం చుట్టుపక్కల గాలించేను వృథాగా. ఆమె జాడ తెలియలేదు ఆ బంగళాలో. ఆమె నన్ను మోసంచేసిందా ? ఏమో ? ఆమె ఎందుకు పారిపోయిందో ?

ఆ శిల్పాలతో సాయంకాలంవరకూ గడపి ఆమెకోసం ఆఖరుసారిగా ఎన్నోసార్లు ఎదురుచూసి మళ్ళీ టాక్సీమీద స్టేషనుకి వచ్చేను. ఇంటికిపోయి 'సరిగా రైలుదిగే సమయానికి గుండెపోటు వచ్చిందనీ ఎక్కడో పడుకుని లేచేసరికి సమయం దాటిపోయిం'దనీ బాధాకరంగా అభినయిస్తూ మా వాళ్లని నమ్మించేను. మరి అసలు విషయం చెప్తే ఎలా ?

తరువాత మామయ్య వ్రాసేడు. నీకు బదులు ఆ ఉద్యోగం మరో అమ్మాయి కిచ్చేరనీ నేనుంటే నాకే యిచ్చేవారని. ఆ ఉద్యోగం రాలేదు కనుక మరో సంవత్సరం చదివేను.

★ ★ ★

మళ్ళీ అదే ఊరు ఉద్యోగాన్వేషణకి బయలుదేరేను. 'కొంపదీసి మళ్లీ ఏ భామా

తన్ను మాయ చెయ్యదు గదా అని జంకుతూనే. కాని ఆనాటి అనుభవం చిరస్థాయిగ నివాసం యేర్పరచుకుంది నా గుండెల్లో.

ఈమారు అదృష్టం నన్ను వరించింది. ఏ బాదరబందీ లేకుండా చక్కగా రెండు వందల రూపాయిల ఉద్యోగం వచ్చింది మా మామయ్యా ఆఫీసులోనే. ఆఫీసర్ గారి వద్ద నుంచి శలవుతీసుకొని బయటకు వస్తుంటే ఎవరో నాచేయిపట్టుకున్నారు. చూస్తే ఆమే! ఆనాడు నా ఉద్యోగానికి తిలాంజలులు సమర్పింపజేసి చిత్రమైన అనుభవం కలిగించిందామే! ఆమె కనుకొలకులలో నీరు నిల్చి దిగజారుదామని ప్రయత్నిస్తుంటే చేరుమాలు నిర్దాక్షిణ్యంగా పీల్చివేసింది.

'మీతో ఎంతో మాట్లాడాలి. దయుంచి బీచ్‌కి వస్తారా' అని ఆమె జాలిగా ప్రాధేయపూర్వకంగా అడిగింది. అసలు ఉద్యోగం రాగానే నా హృదయం పులకరించి పరవశిస్తుంది. అందులో ఆమెను మళ్ళా కలుసుకోగలిగినందుకు ఆనందం అవధులు దాటుతూంది. ఆమె ఆహ్వానం నన్ను నిజంగా ఉక్కిరిబిక్కిరిచెయ్యదూ? ఒక్కసారి గుఱ్ఱపు పందెం గెలిచిన వాడిలాగా అయిపోయేను. కాఫీ యిత్యాదులు సేవించేక యిద్దరం బీచ్‌కి పోయాం.

ఆమె ముఖంలో ఏదో బాధ గోచరిస్తోంది. అయినా ఆ సంధ్యాకాంతుల్లో ఆమె అందంగానే కన్పిస్తుంది. ఆ బాధలో ఆమె మరీ అందంగా ఉందేమో? ఎదురుగ ఉత్తుంగ తరంగాలతో కల్లోలంగా వున్న సంద్రాన్నీ, ఆనందకరసంఘటనలతో ఉరకలు వేస్తున్న నా హృదయాన్నీ పోల్చుకుంటున్నా. ఇంతలో ఆమె మెల్లగా 'క్షమించండి, మిమ్మల్ని మోసం చేసే నా అందం వెనుక ఎంత విషం వుందో వెల్లడిస్తా.

ఆనాడు .... మీరు నేను ప్రయత్నించిన ఉద్యోగంకోసమే వస్తున్నారని తెలిసింది. మీ ముందురోజే నేనూ యింటర్వ్యూకి వెళ్లేను. మన యిరువురిలో ఒకరికే అజాబ్. అందులో మీకు ప్రిఫరెన్సు. నాకు ఆ పరిస్థితుల్లో ఉద్యోగం చాలా అవసరమైంది. మిమ్మల్ని ఆ యింటర్వ్యూకి హాజరు కానివ్వలేకపోతే ఆ ఉద్యోగం సంపాదింపవచ్చునని మిమ్మల్నానాడు ఆ బంగళాలోకి తీసికెళ్ళి వదిలివేశా. నా ప్రణాళిక విజయవంతమవటానికి కారణం బాహ్యరూపం, అంతరాగ్ని యివి రెండూ.

ఉద్యోగంచేస్తున్నా మీ కెంతో అన్యాయం చేసేనని మనసు బాధపెడుతూండేది. ఎన్నోసార్లు అందుకోసం విలపించేనుకూడా. తప్పు చేసేటప్పుడు అట్టే బాధపెట్టదు మనసు. తరువాత మన బలహీనత నాధారంగా గొని చిత్రవధచేస్తుంది. నా ఆర్జితంలో మిగల్చగలిగినంత మిగిల్చేను పాపపరిహారార్థం. అది మీరు తీసుకోండి. ఆఫీసర్‌గారివద్ద నా పలుకుబడి ఉపయోగించి నా పోస్ట్ మీకు యిచ్చేటట్టు చేసి నేను రిజైన్‌చేస్తా. అలా అయినా నా పాపం పూర్తిగా పోదు. చేసిన మోసానికి తగిన శిక్ష అనుభవించితే కాని హృదయం పరిశుద్ధంకాదు.' తెల్లబోయాను నేను. ఆమె అంటే ద్వేషం పుట్టింది. ఛీ! పయోముఖ విషకుంభం. 'శీలాన్ని ఎరగబెట్టుకొని ఇలా ఎందరిని మోసంచేసిందో!' మనసు నీతివాక్యాలు జ్ఞాపకం తెచ్చుకుంటూంది.

ఆమె ముఖం చూసేను. దీనంగా కళ్లవెంబడి నీళ్ళుకారుస్తూ నా ముఖంలోకి చూస్తుంది. గుండె నీరయింది. మనసు మంచులా కరిగిపోయింది. అస్పష్టంగా పలికేయి పెదవులు. 'మీ తప్పేముంది? నిరుద్యోగసమస్య మన దేశాన్నిలా పీడిస్తుంటే ఏం చేస్తాం? శతకోటి దరిద్రాల కనంతకోటి ఉపాయాలు, ఏదో వేషమో మోసమో చేసి ఉద్యోగం సంపాదించుకోవటం మంచిదే. మీరూ విచారించనక్కరలేదు. మీ ఆఫీసులోనే బహుశా మీ సుపీరియర్‌గా నన్ను యివాళ నియమించేరు. ఆ నాడూ మీరు నన్ను మోసంచేయకపోతే యీనాడు నాకింత మంచిపోస్టు వచ్చేదా? జరిగిందానికి ఏం చేస్తాం? అవసరార్థం మీరు చేసినా అది నా మంచికే వచ్చింది. ఇక ఆ విషయంగురించి బాధపడితే నామీద వట్టు' ఆమెను నిస్సంకోచంగా దగ్గరకు తీసుకొన్నాను. ఎదురుగ సంధ్య సిగ్గుపడింది.

తరువాత కొంతకాలానికి ఆమె — నేనూ గృహస్థాశ్రమం స్వీకరించేమనుకోండి. ఆమెనే ఎందుకు పెళ్ళిచేసుకున్నానో మా యింట్లో ఎవరికీ తెలీదు. కష్టం వచ్చినపుడు ఏదో విధంగా దాన్ని పరిష్కరించుకోగలసామర్థ్యం ఉన్న భార్య దొరకటం అదృష్టమేగదూ. నా ప్రయాస మొదట ఫలించకపోయినా కొనకు ఫలించింది.

★


# కామధేను

ఇది విలువైన మలయాళ మూలికలతో ప్రాచీనాయుర్వేదపద్ధతిని శాస్త్రీయంగా తయారైన గొప్పమందు. వ్యాధిగ్రస్తులె కాక ఎట్టి వ్యాధిలేనివారుకూడా దీనినిసేవిస్తే దేహాన్ని బలపరచి రసాయనంగా పనిచేయును.

దీనిని స్త్రీ పురుషులు నిరభ్యంతరముగా వాడవచ్చును. మందు మంచి రుచిగావుండును. పథ్యములేదు.

వీర్యనష్టం, ఋతుదోషం, నరముల నిస్సత్తువ, సెగరోగం, మూత్రదోషం మొదలయిన వ్యాధులకు ఈ మందు పెట్టింది పేరు. మూత్రముతోపోవు శుక్లమును, మేహదుర్నీరును, మేహవ్యాధిని, మేహదురదను, మూగతీటను, జననేంద్రియ సంబంధమైన రుగ్మతలను, జననేంద్రియం సన్నబడుట, చిక్కిపోవుట, లేపనశక్తి తగ్గివుండుట, మధుమేహం, నిద్రలేమి, ధాతు దృఢీకరణం లేకుండుట, నరముల నిస్సత్తువ మున్నగు వ్యాధులను ఇది తప్పక కుదుర్చును. మేహకాక, మూలకాక, గుండెదడ, వెన్నునొప్పి, దగ్గు, కానము మున్నగు బాధలను నివారణచేయును.

ఆకలిలేమి, మలబద్ధకం, నీరుకట్టు, నడుమునొప్పి, కాళ్లుచేతులు తీట, తెలుపువ్యాధి, తల్లత్రిప్పుట, జ్ఞాపకశక్తి తగ్గుట మొదలైన బాధలను నివారించి బలాన్ని, ఆరోగ్యాన్ని, దేహకాంతిని యిచ్చి యెంతో మేలుచేయును. శీఘ్రంగా ముసలితనం రాకుండా చేస్తుంది.

డబ్బి 1-కి రు. 3=0

ధనలక్ష్మి అండ్ కో., ★ సౌకార్‌పేట, మద్రాసు-1.